



రద్దీగా ఉన్న బేకరీ దుకాణం

గ్రావెల్ దోపిడీ

గంగవరంలో ఇష్టారాజ్యంగా అక్రమ తవ్వకాలు





గంగవరంలో జగనన్న కాలనీకి ఆనుకొని ఉన్న కొండవాలు ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన భారీ గోతులు

- జగనన్న కాలనీ లే-అవుట్ అవసరాల మాటున గ్రావెల్ దందా
- రాత్రిపూట యంత్రాలతో తవ్వకాలు, ఇతర ప్రదేశాలకు రవాణా
- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు

సబ్బవరం, డిసెంబరు 31:

మండలంలోని గంగవరంలో (జీవీఎంసీ 88వ వార్డు) జగనన్న ఇళ్ల కాలనీల అవసరాల మాటున గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. అర్ధరాత్రి దాటిన తరువాత నుంచి తెల్లవారుజాము వరకు ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్ తవ్వి, డంపర్ లారీల్లో తరలిస్తున్నారు. గ్రావెల్‌ను కొత్తూరు, వెదుళ్లనరవ, అజనగిరి, దువ్వాడ తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు ఖాళీ స్థలాల్లో నిల్వ చేస్తున్నారు. ఇక్కడి నుంచి గాజువాక, దువ్వాడ, అగనంపూడి, లంకెలపాలెం, తదితర ప్రాంతాల్లోని లే-అవుట్లు, ల్యాండ్ ఫిల్లింగ్‌కు తరలిస్తున్నారు. దూరాన్నిబట్టి ఒక్కో లారీ గ్రావెల్‌ను రూ.5 వేల నుంచి రూ.8 వేలకు విక్రయిస్తున్నారు.

విశాఖ నగరం సొంత ఇల్లు లేని పేదల కోసం సబ్బరవం మండలం గంగవరంలో కొండవాలు ప్రాంతంలో భారీ లేఅవుట్ వేసి, స్థలాల పట్టాలు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఈ లేవుట్‌లో రోడ్ల నిర్మాణంతోపాటు ఇళ్ల పునాదుల ఫిల్లింగ్ కోసం గ్రావెల్ అవసరం ఏర్పడింది. దీంతో ప్రభుత్వం మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతితో సంబంధిత కాంట్రాక్టర్.. ఇళ్ల స్థలాల లేవుట్‌కు సమీపంలోని కొండవాలు ప్రదేశంలో గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. దీంతో కొంతమంది అక్రమార్కుల కన్ను ఈ గ్రావెల్ తవ్వకాలు జరిపే ప్రదేశంపై పడింది. ఎవరికీ అనుమానం రాకుండా రాత్రిపూట ఎక్స్‌కవేటర్లతో భారీగా గ్రావెల్ తవ్వి తరలించుకుపోతున్నారు. ఇక్కడి నుంచి నేరుగా గాజువాక, దువ్వాడ, అగనంపూడి, లంకెలపాలెం, గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో ప్రైవేటు లే-అవుట్లు, ల్యాండ్ ఫిల్లింగ్‌కు తరలిస్తున్నారు. టిప్పర్ గ్రావెల్ రూ.5 వేల నుంచి రూ.8 వేలకు అమ్ముకుంటున్నారు. గ్రావెల్‌కు ఆర్డర్లు లేకపోతే కొత్తూరు, వెదుళ్లనరవ, అజనగిరి, దువ్వాడ తదితర ప్రాంతాల్లో ప్రైవేటు స్థలాల్లో నిల్వ చేస్తున్నారు.



కొత్తూరులో అక్రమార్కులు నిల్వ చేసిన గ్రావెల్ కుప్పలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

గంగవరంలో అక్రమంగా జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్, విజిలెన్స్, రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇస్తున్నామని, దాడులు చేసి అక్రమార్కులను పట్టుకోక పోగా, సమాచారం ఇచ్చిన తమపైనే చిందులేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగవరం గ్రామానికి చెందిన వార్డు వలంటీరు ఒకరు గ్రావెల్ తవ్వకాలు, రవాణాలో చక్రం తిప్పుతున్నట్టు స్థానికంగా ప్రచారం జరుగుతున్నది. ఇతనితోపాటు మరో ఎనిమిది మందిపై రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని, పోలీసులు కూడా కేసులు నమోదు చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు.

న్యూ ఇయర్ సందడి



అనకాపల్లిలో పూల దుకాణం వద్ద కొనుగోలుదారులు

- కొత్త సంవత్సరం 2024కి స్వాగతం
- వీధుల్లో సందడి చేసిన యువత
- బేకరీలు, పూలు, పండ్ల దుకాణాల వద్ద రద్దీ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 31: అనకాపల్లికి నూతన సంవత్సర శోభ సంతరించుకుంది. అర్ధరాత్రి 12 గంటలకు 2023వ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, 2024వ సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో ఆహ్వానించారు. పలుచోట్ల పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. కేకులు కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. యువకులు బైక్‌లపై తిరుగుతూ సందడి చేశారు. కాగా నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఇళ్ల ముందు రంగులతో ముగ్గులు వేశారు. కిందిస్థాయి ఉద్యోగులు తమ పైఅధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి పండ్లు, పూల బొకేలు, కేకులు, మిఠాయిలు కొనుగోలు చేశారు. దీంతో ఎప్పటిమాదిరిగానే వీటి ధరలు పెరిగాయి. నాలుగు పండ్లు యాపిల్ రూ.100 నుంచి రూ.125కి, కమలా పండ్లు నాలుగు పండ్లు రూ.50 నుంచి రూ.60కి విక్రయించారు. కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో బిర్యానీ, పలు రకాల మాంసాహారాలను ఆఫర్లపై విక్రయించారు. దుకాణాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. కాగా స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తరువాత గ్రీటింగ్ కార్డుల అమ్మకాలు బాగా తగ్గిపోయాయి.



అమ్మకానికి యాపిల్, కమలాలు

ప్రతిభ చాటిన సూక్ష్మ కళాకారులు


- పెన్సిల్ ముల్లుపై కొత్త సంవత్సరం

మాడుగుల రూరల్/ నక్కపల్లి, డిసెంబరు 31: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సూక్ష కళాకారులు మరోసారి తమలోని ప్రతిభను చాటి చెప్పారు. మాడుగుల మండలం మండలం ఎం.కోడూరు గ్రామానికి చెందిన సూక్ష కళాకారుడు నైదండ గోపాల్ పెన్సిల్ ముల్లుపై '2024' చెక్కి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికాడు. ప్రత్యేక దినాల్లో గోపాల్ తన కళా నైపుణ్యంతో సూక్ష్మ కళాఖండాలు తయారు చేస్తుంటాడు. పెన్సిల్ ముల్లుపై '2024' అంకెలను చెక్కడానికి సుమారు రెండు గంటల సమయం పట్టిందని గోపాల్ వెల్లడించాడు. కాగా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేశ్ తన కళానైపుణ్యంతో పెన్సిల్ ముల్లుపై 2024 అంకెలను అద్భుతంగా చెక్కాడు. 12 మి.మీ.ల ఎత్తు, 6 మి.మీ వెడల్పున ఈ అంకెలు చెక్కడానికి నాలుగు గంటలు పట్టిందన్నాడు.




పెన్సిల్ ముల్లుపై వెంకటేశ్ చెక్కిన 2024

సూక్ష కళాకారుడు నైదండ గోపాల్



పెన్సిల్ ముల్లుపై గోపాల్ చెక్కిన 2024



దేవునిగుమ్మం శ్రీవారి ఆలయం వద్ద పేరుకుపోయిన చెత్త

పేరుకుపోతున్న చెత్త కుప్పలు!

- ఆరో రోజుకు పారిశుధ్య కార్మికుల సమ్మె

అనకాపల్లి టౌన్, డిసెంబరు 31: సమస్యలు పరిష్కరించాలని జీవీఎంసీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారానికి ఆరో రోజుకు చేరింది. జోనల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో కార్మికులు నిరసన కొనసాగిస్తున్నారు. కాగా పర్మనెంట్ కార్మికులు కొన్ని ప్రాంతాల్లోనే చెత్తను తొలగిస్తుండడంతో మిగిలిన ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతున్నది. కూరగాయల మార్కెట్, దేవుని గుమ్మం శ్రీవారి ఆలయం, ఉడ్‌పేట బాలాజీదాస్ వీధి, లక్ష్మీదేవిపేట ఆర్ఎఆర్ఎస్, తదితర ప్రాంతాల్లో చెత్త సమస్య అధికంగా వుంది. కుక్కలు, పందులు చెత్తాచెదారాన్ని చిందరవందర చేస్తున్నాయి. చెత్త కుళ్లిపోయి దుర్వాసన వస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

వడ్డాది వంతెన వద్ద నిలిచిపోయిన వాహనాలు



వడ్డాది వంతెనపై ట్రాఫిక్ జామ్!

- తీవ్ర ఇబ్బందులు పడిన వాహనదారులు

బుచ్చెయ్యపేట, డిసెంబరు 31: భీమునిపట్నం- నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో వడ్డాది వద్ద కొద్ది రోజుల నుంచి వాహనదారులు పడుతున్న ఇక్కట్లు వర్ణనా తీతం. ఏడాదిన్నర క్రితం పెద్దేరుపై వంతెన కుంగిపో వడంతో ప్రత్యామ్నాయ రవాణా కోసం పక్కనే కాజ్‌వే నిర్మించారు. డిసెంబరు మొదటి వారంలో తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో కాజ్‌వే అప్రోచ్ రోడ్డు ధ్వంసమైంది. దీంతో వాహనాల రాకపోకలకు వీలుకాని పరిస్థితి నెలకొంది. అప్రోచ్ రోడ్డు మరమ్మతులు చేయడంలో తీవ్రజాప్యం జరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దీంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లను పాత వంతెన మీదుగా రాకపోకలకు అనుమతించారు. ఆదివారం వడ్డాది సంత కావడంతో వాహనాల రద్దీ పెరిగి, వంతెనపై పలుమార్లు ట్రాఫిక్ స్తంభించింది.



కోటవురట్లలో అంబేడ్కర్ విగ్రహానికి వినతపత్రం ఇచ్చి నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

అంబేడ్కర్‌కు అంగన్‌వాడీలు వినతి!

సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ హెల్పర్లు, వర్కర్లు చేపట్టిన సమ్మె ఆదివారంనాటికి 20వ రోజుకు చేరింది. న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేయకపోగా, శాంతియుతంగా సమ్మె చేస్తున్న తమపట్ల కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి, మునగపాకల్లో 'ఆడుదాం అంగన్‌వాడీలు' అంటూ వినూత్న కార్యక్రమం చేపట్టారు.

నేడు స్పందన రద్దు

అనకాపల్లి రూరల్, డిసెంబరు 31: జిల్లా కలెక్టరేట్‌లో జనవరి ఒకటో తేదీన (సోమవారం) నిర్వహించాల్సిన స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఐచ్ఛిక సెలవు అయినందున పలు శాఖల అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండరని, ఈ కారణంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడం లేదన్నారు.

దీవెన ఆలస్యం

విద్యార్థులు, తల్లిదండ్రుల అవస్థలు

- ఏడాది ఫీజు నాలుగు విడతల్లో తల్లుల ఖాతాలో జమ చేస్తామని ప్రకటించిన వైసీపీ ప్రభుత్వం
- ప్రతిసారీ జాప్యమే
- గత విద్యా సంవత్సరం చివరి విడత నిధుల విడుదలకు రెండు రోజుల క్రితం బటన్ నొక్కిన సీఎం
- ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలైనా ఇప్పటివరకూ ఒక్క విడత కూడా విడుదల చేయని వైనం



విశాఖపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి):

'జగనన్న విద్యాదీవెన' పథకం కింద ఏడాదికి నాలుగు విడతలుగా చెల్లించాల్సిన ఫీజులను ప్రభుత్వం సకాలంలో విడుదల చేయక పోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రు లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కళాశాల లకు నేరుగా ఫీజులు చెల్లించినప్పుడు తమకు ఎటువంటి సమస్యా ఉండేది కాదని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త విధానం తీసుకురావడంతో కష్టాలు మొదలయ్యాయని వాపోతున్నారు.

గతంలో ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను నేరుగా కాలేజీలకు చెల్లిస్తుండేవి. అయితే వైసీపీ ప్రభుత్వం 'జగనన్న విద్యా దీవెన' పేరుతో నాలుగు విడతలుగా విద్యార్థుల తల్లుల అకౌంట్లలో జమ చేస్తామని ప్రకటిం చింది. ఆ డబ్బులను తీసుకువెళ్లి కళాశాలలకు చెల్లించాలని సూచించింది. 2020-21 విద్యా సం వత్సరం నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తోంది. అయితే మొదటి ఏడాదిలోనే విద్యార్థులకు చుక్క లు చూపించింది. కొవిడ్ వల్ల తరగతులు జరగ లేదన్న కారణాన్ని చూపించి నాలుగో క్వార్టర్ మొత్తాన్ని ఎగ్గొట్టింది. కానీ అనేక కాలేజీలు విద్యార్థులపై ఒత్తిడి పెట్టి ఫీజులను కట్టించుకు న్నాయి. ఆ పెండింగ్ మొత్తాన్ని చెల్లిస్తే గానీ విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేదు.

వాయిదాల పర్వంతో ఇబ్బందులు


ప్రతి మూడు నెలలకొకసారి ప్రభుత్వం ఫీజు డబ్బులు విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేయాల్సి ఉంది. అయితే ఒక్కసారి కూడా ప్రభుత్వం సకాలంలో విడుదల చేయలేదు. ఆ విషయం కళాశాలలకు కూడా తెలుసు. అయిన ప్పటికీ పలు కళాశాలలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకువచ్చి ముందుగానే ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఒక్కోసారి సీఎం బటన్ నొక్కిన నెలకు గానీ విద్యార్థుల తల్లుల అకౌంట్లలో డబ్బులు జమ కావడం లేదు. ఈలోగా మరో మూడు నెలలు పూర్తయి పోతోంది. ఇలా ఏడాదిలో మూడు విడతలు ఆలస్యంగా డబ్బులు విడుదల చేస్తున్న ప్రభుత్వం... నాలుగో క్వార్టర్ ఫీజును పెండింగ్‌లో పెడుతోంది. దానిని మరుసటి ఏడాది విద్యా సంవత్సరంలో విడుదల చేస్తోంది. తాజాగా శుక్రవారం సీఎం జగన్మోహన్‌రెడ్డి విడుదల చేసింది గడిచిన విద్యా సంవత్సరానికి సంబంధించినది కావడం గమనార్హం. 2022-23 విద్యా సంవత్సరం మార్చి-ఏప్రిల్ త్రైమాసికానికి సంబంధించి విడుదల చేయాల్సిన మొత్తాన్ని సీఎం విడుదల చేశారు. అంటే, సుమారు ఏడు నెలలు ఆలస్యంగా ఫీజు మొత్తాలను విడుదల చేశారు. గత ఏడాది ఫైనలియర్ విద్యార్థులు క్యాంపస్‌లు నుంచి కూడా వెళ్లిపోయారు. ఆయా క్వార్టర్లకు సంబంధించిన ఫీజులను విద్యార్థులు ఎప్పుడో చెల్లించేశారు. కానీ, సీఎం జగన్మోహన్‌రెడ్డి మాత్రం వచ్చే ఏడాది ఇవ్వాల్సిన మొత్తాన్ని ఇప్పుడే ఇస్తున్నట్టు కలరింగ్ ఇస్తూ బహిరంగ సభను ఏర్పాటుచేసి మరీ బటన్ నొక్కారు.

మొదటి క్వార్టర్ ఎప్పుడు..?

ఇకపోతే, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి (జూలై-సెప్టెంబరు) క్వార్టర్‌కు సంబంధించిన ఫీజులను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. గత విద్యా సంవత్సరం నాలుగో విడత క్వార్టర్ ఫీజును ఏడు నెలలు ఆలస్యంగా ఇప్పుడు విడుదల చేసింది. మరి..ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన మొదటి క్వార్టర్ ఎప్పుడు విడుదల చేస్తారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. మొదటి క్వార్టర్‌తో పాటు రెండో క్వార్టర్ కూడా పూర్తయిందని విద్యార్థులు చెబుతున్నారు. కాలేజీల నుంచి ఫీజులు చెల్లించాలని ఒత్తిడి ఉందని, ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికే అనేక కాలేజీలు విద్యార్థులపై ఒత్తిడి పెట్టి మొదటి, రెండు క్వార్టర్లకు సంబంధించిన ఫీజులను కట్టించుకున్నాయి.


వసతి దీవెన ఏదీ..?

ఫీజులను విద్యా దీవెన పేరుతో చెల్లిస్తున్న ప్రభుత్వం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను వసతి దీవెన కింద అందజేస్తామని ప్రకటించింది. డిగ్రీ, ఇంజనీరింగ్, ఇతర ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ఏడాదికి రెండు విడతల్లో రూ.20 వేలు చెల్లిస్తామని పేర్కొంది. అయితే, గడిచిన మూడేళ్ల నుంచి ఒక్కసారి మాత్రమే రూ.పది వేలు చొప్పున అందిస్తోంది. ఒక్కో విద్యార్థి పది వేలు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏటా సుమారు 40 వేల మంది విద్యార్థులు పది వేల రూపాయల చొప్పున గడిచిన మూడేళ్ల నుంచి నష్టపోయారు. దీనిపై ఎవరిని అడిగినా ప్రయోజనం లేకపోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన ఇబ్బందులు ఉంటే సాంఘిక సంక్షేమ, బీసీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖలు అధికారులను కలిసి విన్నవించుకునేవారు. సాంఘిక సంక్షేమ శాఖ అనుసంధానంగా వ్యవహరించేది. కానీ, ఈ శాఖలను కూడా జగన్మోహన్‌రెడ్డి సర్కారు నిర్వీర్యం చేసింది. తమ చేతుల్లో ఏమీ లేదని, తామేమీ చేయలేమంటూ విద్యార్థులకు సదరు శాఖల అధికారులు చెబుతున్నారు.









విద్యార్థులను మోసం చేసిన జగన్‌రెడ్డి : నాగజగదీశ్


విలేకర్లతో మాట్లాడుతున్న జిల్లా టీడీపీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్

అనకాపల్లి, డిసెంబరు 31 : విద్యా దీవెన పథకంలో మూడు వాయిదాల సొమ్ము రూ.3,500 కోట్లు దారిమళ్లించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులను మోసం చేశాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్దా నాగజగదీశ్వరరావు విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేరు మార్చి విద్యా దీవెన పేరుతో మోసం చేశాడన్నారు. విద్యా దీవెన సొమ్మును ఎప్పుడు విడుదల చేస్తారో ప్రభుత్వం చెప్పడం లేదని, దీంతో విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం అప్పులు చేసి కళాశాలలకు చెల్లిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుచేసిదని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రద్దుచేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పిట్ల హరీష్, వరదా మోహన్‌కాంత్, కసిరెడ్డి సాయికృష్ణ పాల్గొన్నారు.

కాశీమదుం ఆనకట్టను పరిశీలించిన రత్నాకర్

కశింకోట, డిసెంబరు 31: మండలంలోని వెదురుపర్తి కాశీమదుం ఆనకట్టను వైసీపీ అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులకు ఉన్న సమస్యలను రత్నాకర్‌కు వివరించారు. ఆనకట్ట పూర్తిగా దెబ్బతినడంతో నీరంతా వృథాగా పోతుందన్నారు. దీనిపై రత్నాకర్ స్పందించి తన సొంత నిధులతో పూడిక తీయించి రైతులకు సాగు నీరు అందించే ఏర్పాటు చేస్తానన్నారు. తాత్కాలికంగా కాలువ వద్ద ఆనకట్టను ఇసుక బస్తాలతో పూడ్చేందుకు కృషి చేస్తామన్నారు.


రైతులతో మాట్లాడుతున్న దాడి రత్నాకర్





భారతదేశం వేద భూమి

స్వామి దివ్యానంద భారతి


ప్రసంగిస్తున్న స్వామి దివ్యానంద భారతి

సబ్బవరం, డిసెంబరు 31 : భారతదేశం వేద భూమి, తపో భూమి అని స్వామీ దివ్యానంద భారతి పేర్కొన్నారు. ఆదివారం సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక సీతారామ కల్యాణ మండపంలో జరిగిన హిందూ సమ్మేళనలో ఆయన మాట్లాడుతూ.. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి హిందువు బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తని పెంపొందించేందుకు సమరసత ఫౌండేషన్ కృషిచేస్తుందన్నారు. అంతకుముందు స్వామీ దివ్యానంద భారతికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు, ఫౌండేషన్ సభ్యులు కర్రి రాజు, రమణ, పట్నాయక్, విశ్వ హిందూ పరిషత్తు జిల్లా అధ్యక్షులు కాళహస్తి పాల్గొన్నారు.






































యువతను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం : బీజేవైఎం

కొత్తూరు, డిసెంబరు 31: యువతను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గేదెల స్వరూప్ ఆరోపించారు. ఆదివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే 2.3లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి వైసీపీ యువతను మోసం చేసిందన్నారు. 2024 జనవరి 1న రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, లేకుంటే నిరుద్యోగులతో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వుడా రమేష్ పాల్గొన్నారు.

ప్రజలకు కష్టాలు లేని రోజులు రావాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 31: నూతన సంవత్సరంలో ప్రజలకు కష్టాలు లేని రోజులు రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పేర్కొన్నారు. ప్రజలకు ద్రోహం చేసే ప్రభుత్వాల స్థానంలో ప్రజలకు మేలు చేసే నూతన ప్రభుత్వాల ఏర్పాటుకు ఈఏడాది పునాదులు పడాలన్నారు. వివిధ తరగతుల సమస్యలపై నిర్వహించే ఉద్యమాలతో ప్రభుత్వాలకు ముకుతాడు వేయాలన్నారు.



డైట్‌లో నూతన సంవత్సరం వేడుకలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 31 : డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ కేకును కట్ చేసి అందరికీ పంచి, నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియపరిచారు. ఈ సందర్భంగా కళాశాల వేదికపై విద్యార్థినీ విద్యార్థులు నృత్యప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో విద్యార్థులంతా మరింత ఉత్సాహంగా ఉండాలని అభిలాషించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్. వైకుంఠరావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ కె.పార్వతి, అసోసియేట్ డీన్ అకడిమిక్స్ కృష్ణనాగు పాల్గొన్నారు.


డైట్‌లో కేకును కట్ చేస్తున్న దాడి రత్నాకర్

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం : పీలా గోవింద

కశింకోట, డిసెంబరు 31 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం ఇక్కడ బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. 18ఏళ్ళు నిండిన యువత ఓటరు నమోదుపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంటకోట రాము, వేగి గోపీకృష్ణ, సూరిబాబు, తాకాశి కృష్ణ, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీలా గోవింద

అంగన్‌వాడీల వినూత్న నిరసన

» అంబేడ్కర్ విగ్రహాలకు వినతులు.. » సమస్యలను పరిష్కరిస్తాం : బండారు


పరవాడలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


సమావేశంలో మాట్లాడుతున్న బండారు సత్యనారాయణమూర్తి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 31 : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఆదివారానికి 20వ రోజుకి చేరుకుంది. ఎన్టీఆర్ స్టేడియంలో ఆడుదాం అంగన్‌వాడీలు కార్యక్రమం చేపట్టారు. వినూత్నంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణల ఫొటోలను మెడలో వేసుకుని ఎన్టీఆర్ స్టేడియంలో అంగన్‌వాడీలు ప్రభుత్వంతో ఆడుదాం అంగన్‌వాడీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు తనూజ, ఉమా నారాయణమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

పరవాడలో.. అంగన్‌వాడీలు ఆదివారం అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన చేపట్టారు. దీనిలో భాగంగా వాడచీపురుపల్లి, పరవాడ, లంకెలపాలెం గ్రామాల్లో గల అంబేడ్కర్ విగ్రహాలకు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల యూనియన్ ప్రతినిధులు కె. లక్ష్మి, విజయ, బి.జానకి, కె.రత్నం, వరలక్ష్మి, నారాయణమ్మ, దేవి పాల్గొన్నారు.

సబ్బవరంలో.. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లన్నీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పరిష్కరిస్తామని మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. అంగన్‌వాడీల సమస్యలపై ఇప్పటికే టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చర్చించారన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట 20 రోజులుగా చేస్తున్న అంగన్‌వాడీల సమ్మెకు ఆదివారం బండారు, స్థానిక నేతలు సంఘీభావం తెలిపారు. అనంతరం అంగన్‌వాడీలకు తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పీబీవీఎస్ఎన్ రాజు ఏర్పాటు చేసిన భోజనాలను బండారు వడ్డించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు భరణికాన బాబూరావు, బుచ్చిరాజు, గండి రవికుమార్, గండి దేముడు, కొటాన అప్పారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వెలమ సంక్షేమ సంఘం ఆత్మీయ కలయిక

కొత్తూరు, డిసెంబరు 31 : అనకాపల్లి మండలం సంపతిపురం పంచాయతీలో వెలమ సంక్షేమ సంఘం ఆత్మీయ కలయిక ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర నవ రత్నాల అమలు కమిటీ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ హాజరయ్యారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కూండ్రపు భీమేశ్వరరావు, లాలం కన్నాజీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, గోవాడ చక్కెర కర్మాగారం మాజీ చైర్మన్ గూనురు మల్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.


వెలమ సంక్షేమం ఆత్మీయ కలయికలో పాల్గొన్న మాజీ మంత్రి బండారు, ప్రజాప్రతినిధులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అనకాపల్లి టౌన్, డిసెంబరు 31 : స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో 1975వ సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఎన్టీఆర్ మార్కెట్ యార్డులోని నాగదుర్గమ్మ గుడి వద్ద జరిగింది. సమావేశానికి 150 మంది మిత్రులు కుటుంబసభ్యులతో హాజరై సరదాగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ బ్యాచ్‌కు సంబంధించి 2024 సంవత్సరానికి గౌరవాధ్యక్షునిగా గాజువాక మాజీ కార్పొరేటర్ పిళ్లా రామకృష్ణ, అధ్యక్షునిగా షేక్ ఇస్మాయిల్, కార్యదర్శిగా మళ్ల లోకేశ్, కోశాధికారిగా రాపేటి నారాయణరావులను ఎన్నుకున్నారు.





































































పాండురంగడి దశావతారాలు ప్రారంభం

పాయకరావుపేట, డిసెంబరు 31 : స్థానిక పాండురంగస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం నుంచి స్వామివారి దశావతారాల అలంకరణ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి పాండురంగస్వామివారిని మత్స్యావతారంలో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఎస్.వెంకట్రాది, భక్తులు పూజలు చేశారు.





















రాజాధిరాజ వాహనంపై తిరువీధి సేవ

నక్కపల్లి, డిసెంబరు 31: ఉపమాక క్షేత్రంలో ఆదివారం రాజాధిరాజ వాహనంపై స్వామివారి తిరువీధి సేవ మాడవీధుల్లో ఘనంగా జరిగింది. ముందుగా కొండపైన, కింద ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిత్య హోమాలు ఆలయ అర్చకులు నిర్వహించారు. తదుపరి పల్లకీలో గోదాదేవి అమ్మవారు, రాజాధిరాజ వాహనంపై ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు.

గజపతినగరంలో పూరిల్లు దగ్ధం

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 31: మండలంలోని రాజవరం శివారు గజపతినగరంలో శనివారం రాత్రి జరిగిన అగ్నిమాదంలో కాకాడ కొండయ్యకు చెందిన పూరిల్లు దగ్ధమయ్యింది. ఇంటిలో ఉన్న మంచం, టీవీ, దుస్తులు కాలి బూడిదయ్యాయి. రాత్రి 12 గంటల సమయంలో పక్క ఇంటి వారు మంటల రావడం చూసి కేకలు వేశారు. డెక్కన్ కంపెనీ ఫైరింజన్ సహాయంతో మంటలను అదుపు చేశారు. తన కుమార్తె సారె సామాన్లు కాలిపోయాయని కొండయ్య కుటుంబ సభ్యులు వాపోయారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏఎస్పీ

కోటవురట్ల, డిసెంబరు 31: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం సాయంత్రం నర్సీపట్నం ఏఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మద్యం, నగదు రవాణా జరగకుండా ముందస్తుజాగ్రత్తల్లో భాగంగా మండలంలో ఏఎస్‌పేట, విశ్వనాథపురం, లింగాపురం జంక్షన్‌ల్లో చెక్‌పోస్టులను ఏర్పాటుచేస్తామన్నారు. ఆయనతో పాటు నక్కపల్లి సీఐ అప్పన్న, ఎస్‌ఐ నారాయణరావు ఉన్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలి

ఎస్.రాయవరం, డిసెంబరు 31: మండలంలోని నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్‌లో నిలుపుదల చేసిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను ప్రయాణికుల సౌకర్యార్థం వెంటనే పునః ప్రాంభించాలని కోరుతూ ఆదివారం ఆ రైల్వే స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేసినట్టు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం అప్పలరాజు తెలిపారు. ఇక్కడ రిజర్వేషన్ సౌకర్యం లేకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎం.సత్యనారాయణ, నాయకులు కె.ప్రసాద్, ఎ.భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా ఉప్పరాపల్లి ఆలయ వార్షికోత్సవం

ఎస్.రాయవరం, డిసెంబరు 31: మండలంలోని ఉప్పరాపల్లిలోని లక్ష్మీ బాలగణపతి, శ్రీలక్ష్మీ, మయూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల ఆలయ 4వ వార్షికోత్సవం ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్. శ్రీరాములు, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ తుమ్మపాల అప్పలరాజు, వైస్ ప్రెసిడెంట్ రమణ, కార్యదర్శి వెంకటసత్యనారాయణ, సురేష్ పాల్గొన్నారు.

సందడిగా తూర్పు కాపుల ఆత్మీయ సమ్మేళనం



తూర్పు కాపుల ఆత్మీక కలయికలో మాట్లాడుతున్న పంచకర్ల రమేష్‌బాబు, పాల్గొన్న ప్రగడ నాగేశ్వరరావు తదితరులు


ఎలమంచిలి, డిసెంబరు 31: తూర్పుకాపుల ఆత్మీయ సమ్మేళనం సందడిగా జరిగింది. ఆదివారం ఎలమంచిలి సమీపంలోని పెంజెరువు వద్ద గల తోటలో తూర్పు కాపు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, తూర్పుకాపు సంఘం జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ ఆస్పత్రుల్లో భవానీలకు వైద్య సేవలు

ఎలమంచిలి, డిసెంబరు 31: విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునేందుకు పాదయాత్రగా వెళుతూ లారీ ప్రమాదానికి గురైన భవానీ భక్తులు విశాఖ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. కొక్కిరాపల్లి అగ్రహారానికి చెందిన ఐదుగురు భవానీలు ఈనెల 23 వ తేదీన బయలుదేరి విజయవాడ వెళుతుండగా 28వ తేదీన తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండల పరిధిలో లారీ ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో కొక్కిరాపల్లికి చెందిన గొర్లె అప్పలనాయుడు మృతి చెందగా, మరో నలుగురు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. క్షతగాత్రులంతా విశాఖ కేజీహెచ్, కృషి ఐకాన్ ఆస్పత్రుల్లోనూ వైద్య సేవలు పొందుతున్నారని, వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు.







అంగన్‌వాడీల పోరాడుదాం ఆంధ్రా

మునగపాక, డిసెంబరు 31 : అంగన్‌వాడీలు 20వ రోజు సమ్మెలో భాగంగా ఆదివారం శిబిరం వద్ద పోరాడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. జగన్ మాస్కులతో టగ్ ఆఫ్ వార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక టీమ్ జగన్ మాస్కులతో.. మరొక టీం అంగన్‌వాడీల కాగా జగన్ టీమ్‌ను ఈడ్చిపారేయడంతో నవ్వులు విరిశాయి. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రామలక్ష్మి, జయలక్ష్మి, హేమ, తులసి, లక్ష్మి, బేబి, పద్మ పాల్గొన్నారు.

కోటవురట్లలో..

మండల కేంద్రం శివారు రాట్నాపాలెం, పాములవాకల్లో అంబేడ్కర్ విగ్రహాలకు అంగన్‌వాడీలు ఆదివారం వినతిపత్రాలు అందజేశారు. రాట్నాపాలెంలో అంగన్‌వాడీలు చేపట్టిన దర్నాకు దళితులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్ర మంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బుకా పుష్పకుమారి, కాకర చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.


జగన్ మాస్కులతో టగ్ ఆఫ్ వార్ ఆడుతున్న అంగన్‌వాడీలు



























బుచ్చెయ్యపేట ఎస్‌ఐగా ఈశ్వరరావు


ఎస్‌ఐ ఈశ్వరరావు

బుచ్చెయ్యపేట, డిసెంబరు 31 : బుచ్చెయ్యపేట ఎస్‌ఐగా డి.ఈశ్వరరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఎలమంచిలి ట్రాఫిక్ స్టేషన్ ఎస్‌ఐ గా పనిచేస్తున్న ఇతనిని ఇక్కడికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. కాగా, ఇక్కడ పనిచేస్తున్న సీఐ కుమారస్వామి అనకాపల్లి ఎస్పీ ఆఫీసుకు బదిలీ అయ్యారు. ఇదిలావుంటే, కొత్త ఎస్‌ఐకు సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు.

ఆ నాలుగు కి.మీ.లు దాటాలంటే నరకమే!

- ఆరిలోవ అటవీ ప్రాంతంలో ఏడాది క్రితం పనులను ప్రారంభించిన నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్
- నిధులు మంజూరు కాకపోవడంతో నిలిపివేసిన కాంట్రాక్టర్
- దుమ్ము, ధూళి ఎగసి పడుతుండడంతో వాహనదారులకు ఇబ్బందులు


ఆరిలో అటవీ ప్రాంతం ఐదో మైలు రాయివద్ద అస్తవ్యస్తంగా మారిన విస్తరణ పనులు

గొలుగొండ, డిసెంబరు 31 : మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాదిలో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ శంకుస్థాపన చేసి ఈ పనులను ప్రారంభించారు. ఏడాది కావస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో వాహనచోదకులు అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడమే ఇందుకు కారణంగా చెపుతున్నారు.

టీడీపీ హయాంలో అయ్యన్నపాత్రుడు మంత్రి ఉన్న సమయంలో నర్సీపట్నం నుంచి కృష్ణాదేవిపేట వరకు 24 కి.మీ.రోడ్డు విస్తరణకు రూ.24కోట్లు మంజూరు చేయించారు. ఆ సమయంలో నర్సీపట్నం నుంచి ఎర్రవరం రాజులబాబు గుడి వరకు, అలాగే పప్పుశెట్టిపాలెం నుంచి కృష్ణాదేవిపేట వరకు 20 కి.మీ. వరకు 12 అడుగులు ఉన్న రహదారిని 24 అడుగులుగా విస్తరించారు. అయితే ఆరిలోవ అటవీ ప్రాంతంలోని రాజులబాబు గుడి నుంచి పప్పుశెట్టిపాలెం జంక్షన్ వరకు నాలుగు కిలోమీటర్లు రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఇందుకు అటవీ శాఖ అనుమతులు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అనంతరం వైసీపీ ప్రభుత్వ ఏర్పాటు కావడంతో ఈ నాలుగు కిలోమీటర్ల రోడ్డు పనుల పూర్తి ఎమ్మెల్యే గణేశ్ హామీ ఇచ్చారు. అటవీ శాఖ నుంచి అనుమతులు రావడంతో రూ.నాలుగు కోట్లను వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో గత ఏడాది ఈ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇందులో భాగంగా నాలుగు కిలో మీటర్లకు ఇరువైపులా క్రషర్ బుగ్గి తదితరాలు కలిపి మీటరు లోతున గత ఏడాది కప్పారు. ఆ తరువాత పనులు ముందుకు సాగలేదు. దీంతో లారీలు, బస్సులు, వ్యాన్లు వెళ్లే సమయాల్లో పెద్ద ఎత్తున దుమ్ముధూళి ఎగసి పడుతోంది. రాళ్లు, కంకర పైకి తేలాయి. ఇదిలావుంటే, నాలుగు కి.మీ.మేర రోడ్డంతా గోతులమయంగా మారింది. దీంతో వాహనదారులు అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వర్షాలు కురిసే సమయాల్లో ఆయా గోతుల్లో నీరు చేరుతుండడంతో తరచూ వాహనచోదకులు చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటు విశాఖ నుంచి అటు రాజమండ్రి వరకు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈ రహదారిగుండా రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇక్కడి పరిస్థితులను గుర్తించి ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వాహనచోదకులంతా కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ మండల జేఈ ప్రసాద్‌ను వివరణ కోరగా, త్వరలో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.


పురటాలమ్మ చెట్టు ప్రాంతంలో రోడ్డుపై ఎగసిపడుతున్న దుమ్ముధూళి

అయోధ్య శ్రీరాముని అక్షింతలు ఊరేగింపు

డిప్యూటీ సీఎం బూడి సహా పెద్దసంఖ్యలో హాజరు


అక్షింతలు ఊరేగింపులో ముత్యాలనాయుడు తదితరులు

దేవరాపల్లి, డిసెంబరు 31 : అయోధ్య శ్రీరాముని పూజలకు వినియోగించే అక్షింతలు, కలశం ఊరేగింపు ఆదివారం ఇక్కడ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీరామ నామ స్మరణతో ఈ ప్రాంతం మార్మోగింది. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు హాజరై పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచారక్ స్వామినాయుడు, ఎంపీపీ రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బుల్లి లక్ష్మి, బూరే బాబూరావు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- విప్ కరణం ధర్మశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

చోడవరం, డిసెంబరు 31 : అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్టు విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో నియోజకవర్గంలో సంక్షేమ పథకాల కింద రూ.850 కోట్లు ప్రజలకు అందించినట్టు చెప్పారు. వచ్చే ఏడాది కూడా ప్రజలకు మరింతగా పథకాలు అందిస్తామన్నారు. అనంతరం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. డీసీఎంఎస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు పల్లా నరసింగరావు, ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ భైన ఈశ్వరరావు, వైసీపీ మండల అధ్యక్షుడు డీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

- 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ'లో టీడీపీ నాయకులు


మాడుగులలో పాదయాత్ర చేస్తున్న రామానాయుడు

మాడుగుల, డిసెంబరు 31 : రాష్ట్రాభివృద్ధి చేతగాని సీఎం జగన్‌ను గద్దె దించడమే అందరి లక్ష్యం కావాలని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పిలుపునిచ్చారు. 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఆదివారం మాడుగులలో పాదయాత్ర నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చేసిన అభివృద్ధి ఏమిటో రోడ్ల పరిస్థితి చూస్తే అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం ప్రగతి పథాన పయనిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదపూడిలో ఆదివారం జరిగిన 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో మాట్లాడారు. వైసీపీ పాలన అంతా అస్తవ్యస్తంగా మారిందన్నారు. జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. మళ్లీ రాష్ట్రానికి మంచిరోజులు రావాలన్నా, ప్రజల కష్టాలు తీరాలన్నా రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ బాండ్లను గ్రామస్థులకు పంపిణీచేపేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'వైసీపీ ప్రభుత్వంలో సామాజిక న్యాయం ఎక్కడ ఉంది'?

నాతవరం, డిసెంబరు 31 : వైసీపీ ప్రభుత్వంలో సామాజిక న్యాయం ఎక్కడుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరక సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం నాతవరంలో పార్టీ నాయకులతో కలిసి అయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ఎస్సీలు, బీసీలు దారుణంగా హింసించబడ్డారన్నారు. డాక్టర్ సుధాకర్ లాంటి ఎంతోమంది చంపబడ్డారని ఆరోపించారు. నర్సీపట్నంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేశ్ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడ్ని తిట్టడానికే సమయాన్ని వెచ్చించారని మండిపడ్డారు. దాదాపు ఈ ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో ఏఏ అభివృద్ధి పనులు చేశారో ఎమ్మెల్యే చెపితే బాగుండేదన్నారు. టీడీపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీతారామ్మూర్తి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీలు ఎస్.విజయ్‌కుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ కొండబాబు, నాయకులు అప్పిరెడ్డి మాణిక్యం, కూండ్రపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



నాతవరంలో మాట్లాడుతున్న సత్యనారాయణ..., పెదపూడిలో బాబు ష్యూరిటీ బాండ్లు పంపిణీ చేస్తున్న కోటేశ్వరరావు.

ఏటిగైరంపేట ఉప సర్పంచ్ నూకరాజు మృతి

- పాడె మోసిన మాజీ మంత్రి 'అయ్యన్న'

గొలుగొండ, డిసెంబరు 31 : మండలంలోని ఏటిగైరంపేట ఉపసర్పంచ్, టీడీపీ మండల నాయకుడు నల్లబెల్లి నూకరాజు ఆదివారం ఉదయం మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామంలో కన్నుమూశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు నివాళులర్పించి ఆయన కుటుంబాన్ని ఓదార్చారు. అంతేకాక అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోశారు. టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, పలు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు సుర్ల బాబ్జి, చింతల సూర్యాకాంతం, కొల్లి సత్యనారాయణ, చిటికెల సాంబమూర్తి, గెడ్డం నానాజీ, కొల్లి రాంబాబు తదితరులతో పాటు గ్రామ ప్రజలు సంతాపం తెలిపారు.


పాడే మోస్తున్న అయ్యన్న పాత్రుడు (అంతర్ చిత్రం) నూకరాజు (ఫైల్)

'దళితులపై దాడులు అరికట్టాలి'


మాట్లాడుతున్న సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రంశెట్టి పాపారావు

నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 31 : చెట్టుపల్లిలో ఆదివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రంశెట్టి పాపారావు మాట్లాడుతూ ప్రభుత్వం దళితులకు కేటాయించిన నిధులను దళిత కాలనీల్లోనే అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. అలాగే దళితులపై దాడులు అరికట్టాలి డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి రమణమూర్తి మాట్లాడారు దళితవాడల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ భాస్కరరావు, దళిత నాయకులు పాల్గొన్నారు.


















నర్సీపట్నంలో విక్రయానికి ఉంచిన బొకేలు

ఎటు చూసినా 'నూతనోత్సాహం'

నర్సీపట్నం, డిసెంబరు 31 : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో ఆదివారం రాత్రి సందడి వాతావరణం నెలకొంది. సాయంత్రం నుంచి పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఇళ్ల ముందు మహిళలు అందమైన రంగవల్లులు వేశారు. పల్లెలు, పట్టణాలు అన్న తేడాలేకుండా ఎక్కడ చూసినా కోలాహలం కనిపించింది. మాంసాహార హోటళ్లు, కేక్‌లు, స్వీట్‌స్టాల్స్ కిక్కిరిసిపోయాయి. ప్రధానంగా నర్సీపట్నంలోని బంగార్రాజు థియేటర్ రోడ్డు, కృష్ణాబజార్‌లోని మాంసాహార హోటళ్ల వద్ద క్యూలో నిలబడి పలావ్ ప్యాకెట్లు కొనుగోలు చేయడం కనిపించింది. డైరీలు, డెకరేషన్ సామగ్రి కొనుగోలుదారులతో ఆయా దుకాణాలు రద్దీగా మారాయి. అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో కేక్‌లు కట్‌చేసి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


నర్సీపట్నం కృష్ణాబజార్ వద్ద కొనుగోలుదారుల రద్దీ

ఖండివరంలో విజృంభిస్తున్న అతిసార

- మూడు రోజుల క్రితం ఒకరు మృతి
- వాంతులు, విరేచనాలతో పలువురు ఆస్పత్రుల్లో చేరిక


మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అతిసార రోగులు


విశాఖ కేజీహెచ్‌లో చేరిన నారాయణమూర్తి

చీడికాడ, డిసెంబరు 31 : మండలంలోని ఖండివరం గ్రామంలో గత పది రోజులుగా అతిసార విజృంభిస్తోంది. ఈ వ్యాధి బారినపడి మూడు రోజుల క్రితం ఒకరు మృతిచెందగా, కొంతమంది వాంతులు, విరేచనాలతో బాధపడుతూ మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రి, విశాఖ కేజీహెచ్‌లో చికిత్సలు పొందుతున్నారు. పది రోజుల నుంచి ఇప్పటి వరకు 25మంది గ్రామస్థులు ఈ వ్యాధిబారిన పడ్డారు. దీంతో స్థానిక వైద్య సిబ్బంది మాడుగుల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రోగులను తరలించి వైద్యం చేయిస్తున్నారు. ఈనెల 21వ తేదీన వేచలపు నారాయణమూర్తికి వాంతులు, విరేచనాలు కావడంతో వెంటనే మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. అక్కడ అతని పరిస్థితి విషమంగా మారడంతో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి, అక్కడి నుంచి మరింత మెరుగైన వైద్యానికి విశాఖ కేజీహెచ్‌కు తరలించి వైద్యం చేయిస్తున్నారు. ఈనెల 27వ తేదీ అర్ధరాత్రి నుంచి నేమాల సత్తిబాబు అనే వృద్ధుడు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతనిని గురువారం మాడుగుల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి వైద్యం చేయించారు.

అయినప్పటికీ అతని పరిస్థితి విషమంగానే ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. అంతదూరం తీసుకు వెళ్లలేమని చెప్పి అదే గ్రామంలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి తొమ్మిది గంటలకు సత్తిబాబు మృతిచెందినట్టు ఆయన కుమారుడు నేమాల కన్నంనాయుడు విలేకరుల ముందు వాపోయారు. కాగా, మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో ఇ.ఈశ్వరమ్మ, వై.గంగునాయుడు, శీరంరెడ్డి శ్రీరామ్మూర్తి, ఎం.దేముడమ్మ, ఎస్.సన్యాసమ్మలు వైద్య సేవలు పొందుతున్నారని వైద్య సిబ్బంది తెలిపారు. అతిసార మరింత విజృంభించకముందే ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు పారిశుధ్య పనులు చేపట్టాలని మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, గ్రామ నాయకుడు గెంజి బాలాజీ తదితరులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి


- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు

రోలుగుంట, డిసెంబరు 31 : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు కోరారు. మండలంలోని అర్ల గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. జగనన్న గోరుముద్ద మెనూ చార్జీలు పెంచి మధ్యాహ్న భోజన వర్కర్లకు, హెల్పర్లకు వేతనాలు పెంచాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా చేయడంతో పాటు సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. సదరు కార్మికుల సమస్యలపై విజయవాడలో జనవరి ఐదో తేదీన నిర్వహించనున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పారావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన

బుచ్చెయ్యపేట, డిసెంబరు 31 : డిమాండ్ల పరిష్కారానికి అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళన రోజురోజుకు ఉధృతమవుతోంది. ఇందులో భాగంగా ఆదివారం వడ్డాది, తురకలపూడి, బుచ్చెయ్యపేట, రాజాం గ్రామ సచివాలయాల పరిధిలో అంగన్‌వాడీలు ఆటపాటలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిమాండ్లు పరిష్కరించాలన్న తమపై ప్రభుత్వం బెదిరింపులకు దిగుతుండడం తగదన్నారు. వీటికి తాము భయపడేది లేదని, ప్రభుత్వం దిగి వచ్చేవరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.


వడ్డాది సచివాలయం వద్ద ఆటపాటలతో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు



ఖేలో ఇండియా పోటీలకు చోడవరం విద్యార్థి ఎంపిక


- రైఫిల్ షూటింగ్‌లో అద్భుత ప్రతిభ


సుందరరామిరెడ్డి

చోడవరం, డిసెంబరు 31 : జాతీయ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖేలో ఇండియా పోటీలకు స్థానిక క్రీడాకారుడు నల్లమిల్లి సుందరరామిరెడ్డి రాష్ట్రం నుంచి ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో ఈనెల 27నుంచి 31 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఆరో స్థానంలో నిలిచిన సుందరరామిరెడ్డిని ఎంపిక చేశారు. పట్టణానికి చెందిన నల్లమిల్లి గనిరెడ్డి కుమారుడైన సుందరరామిరెడ్డి ప్రస్తుతం పరవాడ మండలం పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఈ సందర్భంగా ఇతనిని పలువురు అభినందించారు.

పొలంలో వరి పనల చోరీపై ఫిర్యాదు

నాతవరం, డిసెంబరు 31 : గాంధీనగరంలో గల తన ఎకరా పొలంలో కోసి ఉంచిన వరి పనలను ఎవరో ఎత్తుకుపోయారని రైతు చెలమశెట్టి అప్పారావు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.25 వేలు పెట్టుబడి పెట్టి పంటను పండించానన్నారు. పంట కోతకు రావడంతో పనలను కోసి పొలంలో ఉంచగా, చోరీ చేశారని వాపోయారు. స్థానికులే ఇందుకు పాల్పడి ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.



రాష్ట్రస్థాయి పోటీలకు 'అవంతి' విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

మాకవరపాలెం, డిసెంబరు 31 : రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఇక్కడి అవంతి కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి పాలిటెక్నిక్ స్పోర్ట్స్‌మీట్‌లో తమ కళాశాల విద్యార్థులు ప్రసాద్, రాహుల్ అద్భుత ప్రతిభ చూపినట్టు ప్రిన్సిపాల్ మోహన్‌రావు తెలిపారు. దీంతో వీరిని జనవరి నాలుగో తేదీ నుంచి అనంతపురంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు.











